అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్న బొజ్జ గణపయ్యను కొలిచే శుభతరుణం ఆసన్నమైంది. ముక్కోటి దేవతల్లో తొలి పూజలు అందుకుని ఆది దేవుడు విఘ్ననాయకుడిని భక్తి శ్రద్ధలతో కొలుచుకునే వినాయక నవరాత్రులు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. యువత ఇప్పటికే వినాయక మండపాల ఏర్పాటు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఇక బొజ్జగణపయ్యను మండపంలో నెలకొల్పి పూజించడమే తరువాయి. కానీ పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను పూజించి తమ భక్తిని చాటుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. – మేడ్చల్‌రూరల్

మహా శ్రేష్ఠం.. మట్టి గణపతి



పీఓపీతో అనర్థాలెన్నో • మట్టి గణనాథుడినే పూజిద్దాం



మట్టి వినాయకులను తయారు చేస్తున్న విద్యార్థులు(ఫైల్)



గోసాయిగూడలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి గణనాథులు

వినాయక చవితి వచ్చిందంటే చిన్నాపెద్ద తేడా లేకుండా వినాయక చవితి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. యువజన సంఘాలు ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను నెలకొల్పాలని భావిస్తుంటారు. అయితే మట్టి విగ్రహాలు దృఢంగా ఉండవని, తాము అనుకున్న విధంగా అందంగా విగ్రహాలు ఉండవని భావిస్తున్న యువత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపై ఆసక్తి చూపుతున్నారు. కానీ పీఓపీతో తయారు చేసిన విగ్రహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదు. మట్టిలో కలవదు... విగ్రహాల తయారీకి అనేక హానికర రంగులు వాడతారు. విగ్రహం దృఢంగా, ఆకర్షణీయంగా ఉండేందుకు ఉపయోగించే క్లాడ్మియం చాలా ప్రమాదకర రసాయన పదార్థం. ఈ రసాయనం మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. చెరువులలో నిమజ్జనం చేసిన అనంతరం పీఓపీ విగ్రహాలు నీటిలో కరిగేందుకు చాలా రోజుల సమయం పడుతుంది. వాటి నుంచి వెలువడే రసాయనాలతో చెరువులో ఉండే జీవరాసులకు ప్రమాదం ఏర్పడుతుంది. ఆ నీటిని మనుషులు వాడితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మొత్తానికి పీఓపీ విగ్రహాలతో ఎన్నో రకాలుగా పర్యావరణం కాలుష్యం అవుతుంది.

అన్నింటికీ మేలు..

మట్టి వినాయకుడి విగ్రహాల ఏర్పాటుతో అన్ని రకాలుగా మేలు జరుగుతుంది. విగ్రహాల తయారీకి బంకమట్టి, కర్రలు, వరిగడ్డి వాడడంతో పాటు హానికర రసాయనాలు ఉపయోగించకుండా తయారు చేస్తారు. నిమజ్జనం తర్వాత ఇవి వెంటనే నీటిలో కరిగిపోతాయి. నీటిలో కరిగిన తర్వాత ఎరువుగా మారుతాయి. నీటిలో ఉండే జలచరాలకు ఎలాంటి ముప్పు ఉండదు.

విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల అవగాహన..

వినాయక చవితి దగ్గరపడుతుండడంతో మట్టి విగ్రహాలను నెలకొల్పాలంటూ పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో, పాఠశాలల్లో ఏటా విద్యార్థులతో మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేయించి వాటిని తమ ఇళ్లలో నెలకొల్పాలని సూచిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి గణనాథులను పలు చోట్ల ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. పీఓపీ విగ్రహాల ఏర్పాటు వల్ల కలిగే పర్యావరణ కాలుష్యం, అనర్థాలను వివరిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వినాయక నవరాత్రుల్లో యువత ఉత్సాహంగా పాల్గొని మండపాల్లో గణనాథుడిని నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజించడం సంతోషకరం. కానీ పర్యావరణ పరిరక్షించాల్సి బాధ్యత కూడా యువత చేతిలోనే ఉంది. రంగురంగుల విగ్రహాలు నెలకొల్పడం వల్ల వాటి తయారీకి ఉపయోగించే రసాయనాలతో జీవకోటికి ముప్పు వాటిల్లుతుంది. కావున మట్టి విగ్రహాలను నెలకొల్పి పర్యావరణాన్ని కాపాడాలి. నేటి యువత భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలి.
– సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్, మేడ్చల్

మట్టి గణపయ్యనే పూజించాలి



మట్టి వినాయకులను పూజిస్తేనే మానవాళికి మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే నెలకొల్పాలి. శాస్త్రం కూడా మట్టి విగ్రహాలనే పూజించాలని చెబుతోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో నీరు కలుషితమై అనేక అనర్థాలు జరుగుతున్నాయి.
– కలగ వెంకటేశ్ శర్మ, పురోహితుడు

పర్యావరణ హితం కోసమే

పర్యావరణాన్ని పరిరక్షించడానికే మట్టి వినాయకులను తయారు చేస్తున్నాం. ఎలాంటి రసాయనాలు లేకుండా బంకమట్టి, వెదురు బొంగులు, కర్రలు, గడ్డితో విగ్రహాలను తయారు చేస్తున్నాం. గత ఐదేళ్ల నుంచి ఈ మట్టి వినాయకులను తయారుచేస్తున్నాం. ప్రస్తుతం మట్టి వినాయకులకు విశేష ఆదరణ లభిస్తుంది.
– చంద్రమోహన్, మట్టి వినాయకుల తయారీదారు

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఉప్పల్: నవరాత్రి ఉత్సవాలను ప్రతి హిందువు గర్వించేలా నిర్వహించుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్ అన్నారు. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్‌లోని ఎస్‌ఆర్ బంకిట్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడప లోపలే తాము గడప దాటితే అందరం హిందువులమని గుర్తించుకుకోవాలని సూచించారు. మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే ఆదుకునేలా అందుబాటులో ఉండాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ రేవల్లి రాజు, గోనె శ్రీకాంత్, ఫణీందర్, వంశీ, ఉప్పల్ శాఖ ఇన్‌చార్జి కంచర్ల భరత్‌రెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు



చెరువు వద్ద పూజలు చేస్తున్న గ్రామ నాయకులు

మేడ్చల్: భారీ వర్షాల కారణంగా మేడ్చల్ పెద్ద చెరువు నీటితో నిండి పొంగి పొర్లుతుండంతో చెరువుకు గ్రామ పెద్దలు, మున్సిపల్ అధికారులు, పాలక వర్గం మంగళవారం పూజలు నిర్వహించారు. గ్రామ బొడ్రాయి నుంచి మేక పిల్లను డప్పు చప్పుల్లతో ఊరేగించి చెరువు వద్ద గంగమ్మకు పూజలు చేశారు. చెరువు నీటిలో మేక పిల్లను వదిలి పెట్టారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి. కౌన్సిలర్లు సందీప్‌గౌడ్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి నర్సింహ్మాస్వామి,సాయికుమార్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి,బాలమల్లేష్, రాఘవెందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మామపై అల్లుడి హత్యాయత్నం

కీసర: కట్నం కోసం మామపై అల్లుడు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగారంలోని రామలింగేశ్వర కాలనీలో అశోక్ నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి బాగా మద్యం మత్తులో అతడి ఇంటికి వచ్చిన అల్లుడు యాదగిరి ఇప్పటికిప్పుడు కట్నం డబ్బులు ఇవ్వాలని గొడవపడి తనతో తెచ్చుకున్న పదునైన ఆయుధంతో అశోక్‌పై దాడి చేసి కడుపులో పొడిచాడు. యాదగిరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన



కీసర: దమ్మాయిగూడ పురపాలక సంఘం కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలు ,స్వచ్ఛదనం-పచ్చదనం , మహిళలకు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్, రూ 500 గ్యాస్‌సిలిండర్, మహిళాశక్తి, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా, చేయూత రూ 4000, పింఛన్ తదితర పథకాలపై టీఎస్‌ఎస్ కళాజాత బృందం సభ్యులు పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు కౌకుట్లచంద్రారెడ్డి, ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్, కమిషనర్లు రాజేంద్రకుమార్,నాగమణి, వైస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మేనేజర్లు వెంకటేష్, చంద్రశేఖర్,కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న తెలుగు (01) కంప్యూటర్ సైన్స్ (01), 5వ తేదీ సాయంత్రం లోగా ఉప్పల్ జిల్లా పరిషత్ హైస్కూలోని డిగ్రీ కళాశాలలో ఆసక్తి గల అధ్యాపకులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్/సెట్ పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440160411, 9440476739.

దాయరకుంటలో ఎఫ్‌టీఎల్ స్థలం కబ్జా



దాయర కుంట ఎఫ్‌టీఎల్ స్థలంలో మట్టి పోసిన దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీలోని దాయర కుంటను అక్రమార్కులు కబ్జా చేశారు. ప్రభుత్వం, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఒక పక్క చెరువులు కుంటల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా నాగారం మున్సిపాలిటీలో మాత్రం కబ్జాదారులు దాయర కుంట ఎఫ్‌టీఎల్ స్థలంలో దర్జగా మట్టి పోసి కుంట స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ , మున్సిపల్‌కార్యాలయ సిబ్బంది మట్టిపోస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు స్పందించి దాయరకుంట స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం వాసవినగర్, గాయత్రీహిల్స్, వెస్ట్ జ్యోతినగర్ కాలనీల్లో రూ.20 లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెస్ట్ జ్యోతినగర్ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనం, డ్రైనేజీ పైపులైన్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీల్లో పార్కులకు ప్రహరీ గోడలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, నర్సింహారెడ్డి, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ శిల్పారామంలో మట్టి గణపతుల పంపిణీ



రామంతాపూర్: ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు ఉప్పల్ శిల్పారామంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటించారు. వివరాలకు 9849909845, 9849031531.

నిమజ్జనం విజయవంతం చేస్తాం : మేయర్



సఫిల్‌గూడ ఘాట్‌ను పరిశీలించిన మేయర్ విజయలక్ష్మి

మల్కాజిగిరి: వినాయక నిమజ్జన ఏర్పాట్లలో తగ్గేదేలేదని విజయవంతంగా ముగిస్తామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం సఫిల్‌గూడ లేక్ పాండ్(నిమజ్జన ఘాట్)ను కార్పొరేటర్ శ్రవణ్‌తో కలిసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. ఈసారి నిమజ్జనాన్ని విజయవంతం చేయడానికి చెక్‌లిస్ట్ సిద్ధం చేశామన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతంలో వచ్చే భక్తులకు సరిపడేలా మొబైల్ టాయిలెట్స్, నీటి నిల్వ సామర్థ్యం, విగ్రహాలు వచ్చే మార్గంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చెక్‌లిస్ట్ తయారుచేసి సంబంధిత ప్రాంత అధికారులకు పంపించామన్నారు. ఈనెల 5 లోపు ఆ ఏర్పాట్లు దాదాపుగా పూర్తవుతాయన్నారు. భక్తులు, మండల నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో 100 శాతం నిమజ్జనం విజయవంతంగా పూర్తి చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ రాజు, ఏసీపీ చక్రపాణి, ఈఈ లక్ష్మణ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు రుత్విక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

రామంతాపూర్: భజరంగ్ సేన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పవిత్ర హనుమాన్ చాలీసాను సామూహికంగా వందలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో పఠించారు. ఈ సందర్భంగా భజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎస్.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిరోజు హనుమాన్ చాలీసా పఠిస్తే అన్ని శుభాలే కలిగి దుష్టశక్తులు దూరమవుతాయన్నారు. భజన్‌సేన సభ్యులు ప్రకాష్, ముత్తినేని జగదీష్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రామంతాపూర్: బైపాస్ రోడ్డులోని రామ్‌శంకర్‌నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మించిన ఫుడ్‌కోర్టులు ఇతర వాణిజ్య సముదాయాలను మంగళవారం ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఉప్పల్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి వినాయక బేబి ఫాండ్‌ను పరిశీలించారు. బేబి ఫాండ్ వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన సమయానికి నీటిని నిండా నింపాలని సూచించారు. మండప నిర్వాహకులకు సహకరిస్తూ.. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకునేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. డీఈ నిఖిల్‌రెడ్డి, బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు 'భరోసా'

- ప్రభుత్వ పాఠశాలల్లో సాధికారత కమిటీలు
- విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు చర్యలు
- లింగ వివక్ష, హింస, వేధింపులను ఎదుర్కొనేలా శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, హింస, వేధింపులను విద్యార్థి దశ నుంచే అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకుగాను పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్ (కమిటీలు) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం , అప్రమత్తంగా ఉండటం, ఆపదలో స్పందించాల్సిన తీరుపై నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో అవగాహన కల్పిస్తారు.

పోలీసు, విద్యాశాఖ ఆధ్వర్యంలో..

విద్యాశాఖ, పోలీసు శాఖల సమన్వయంతో బాలికా సాధికారత కమిటీలు పని చేస్తాయి. ఇందులో ప్రతి తరగతి నుంచి ఇద్దరు చురుకైన అమ్మాయిలు సభ్యులుగా ఉంటారు. వీరే పాఠశాల బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చైర్మన్‌గా, ఉపాధ్యాయురాలు మెంబర్ కన్వీనర్‌గా, షీ టీమ్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. క్లిష్ట పరిస్థితులనూ ధైర్యంగా ఎదుర్కొనేలా, జీవితంలో విజయం సాధించేలా బాలికలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సాధికారత కమిటీలు పని చేస్తాయి. సమాజంలో మహిళలు ముఖ్యంగా బాలికలపై ఎలాంటి అమానుష ఘటనలు జరుగుతున్నాయో వీరికి అవగాహన కల్పిస్తారు. అలాంటి వారిని ఎదుర్కోవాలంటే కేవలం ఒక్కరి వల్లకాదు. మానసిక స్థైర్యానికి తోడు చట్టం అండగా నిలవాల్సి ఉంటోంది. ఆ నమ్మకాన్ని కలిగించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారు.

చేపట్టనున్న కార్యక్రమాలివీ..

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లో 1808 ప్రభుత్వ పాఠశాలలు(మేడ్చల్ జిల్లాలో 507,రంగారెడ్డిలో 1,301) ఉండగా, దాదాపు మూడు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో దాదాపు సగం బాలికలు ఉన్నారు. ఈ కమిటీల ఏర్పాటు మొదలు.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

◆ డయల్ 100, 1098, 181, 112 వంటి టోల్ ఫ్రీ నంబర్లను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. బాలికల్లో ఎదుగుదలతో పాటు వచ్చే మార్పులు, శారీరక ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకత, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహచరుల ఒత్తిళ్లకు 'నో' చెప్పడం తదితరాలను అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలు, హింస తదితర సమస్యలపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు, లైంగిక దాడులు అడ్డుకోవడంపై సదస్సులు నిర్వహిస్తారు. బాలికలు మానసికంగా ధైర్యంగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తారు.

ధైర్యంగా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతాం



అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో బాలికల సాధికారత క్లబ్ (కమిటీ)ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. బాలికలు ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ధైర్యంగా ఎదుర్కొనేలా సిద్ధం చేస్తాం. బాలికలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. ఆ దిశగా పాఠశాలలు, కుటుంబాలతో పాటు సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది.
– విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి

రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే సమావేశం



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. మంగళవారం ఆయన రేషన్ డీలర్ల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్‌కార్డు జారీలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అర్హులు ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో 3 నెలలు రేషన్ తీసుకోకుంటే కార్డులను తీసివేశారని, వాటిని పునరుద్ధరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారంగా రేషన్ డీలర్లకు రూ.5000 ఇవ్వాలని, వారికి ఇచ్చే కమీషన్ పెంచాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే సదుపాయాలు వర్తింపజేయాలన్నారు. అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ బాలరాజు, రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల సంతోష్‌కుమార్, బాల్‌రెడ్డి, చక్రధర్, రమేష్‌సింగ్, శివకుమార్, కరుణానిధి, వెంకటహరి, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, మేకల సునీతాయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు హన్మంతరావు, కరంచంద్, రమేష్, రాముయాదవ్, మధుసూదన్, పరమేశ్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, భాగ్యనంద్‌రావు, వంశీ ముదిరాజ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

ఆర్డీవో ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్యామ్ ప్రకాష్

మౌలాలి: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, వ్యాయామం, ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మౌలాలి డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వేసి విద్యార్థుల చదువు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యార్థుల హాజరు తక్కువైందని తెలిపారు. వంటగదిని పరిశీలించామని పరిశుభ్రతతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నారన్నారు. మల్కాజిగిరి గిర్దావర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బోడుప్పల్: ఖమ్మం జిల్లాలోని మంచికంటనగర్‌లో వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న 50 కుటుంబాలకు భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భవన నిర్మాణ సంఘం చైర్మన్ నత్తి మైసయ్య మాట్లాడుతూ.. భారీ వర్షాలకు దెబ్బతిన్న 50 కుటుంబాలకు తమవంతు నిత్యావసరాలను అందించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఉదార స్వభావంతో ముందుకొచ్చి తమవంతు సహకారం అందించాలన్నారు. భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు ఎక్కిరాల లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, కోశాధికారి బండారు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

మల్కాజిగిరి: వర్షానికి నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం బీజేఆర్‌నగర్‌లో పాక్షికంగా ఇల్లు దెబ్బతినడంతో ఇంట్లో ఉన్న వృద్ధులు పోచయ్య,సిద్దమ్మ ఇల్లు ఖాళీచేసి కూమార్తె వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా బాధితులకు నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. ఆర్‌ఐ పరమేశ్వర్‌రెడ్డి, డీఈ లౌక్య, బాబు, కిషోర్ పాల్గొన్నారు.

దేవాలయానికి దారేది ?



వరదనీటితో మార్కండేయ స్వామి దేవాలయం వీధి ఇలా..

రామంతాపూర్ : నగరంలో కురుస్తున్న వర్షాలకు చిన్న చెరువు ఇందిరానగర్ సమీపంలో ఉన్న మార్కండేయ దేవాలయం వద్ద మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచిపోయి పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక గంగమ్మ దేవాలయం పాండురంగ స్వామి దేవాలయం మార్కండేయ స్వామి దేవాలయం సత్యనారాయణ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాలి. ఈ దారిలో వరదనీరు నిండిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వరద నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.